క్లుప్తంగా

ఆకట్టుకున్న వస్తు ప్రదర్శన

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక కొర్రపాడు రోడ్డులోని ఎస్కేఎస్సీ డిగ్రీ కళాశాలలో ప్రొద్దుటూరు దయాల్‌బాగ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో వస్తు ప్రదర్శన, అమ్మకాలను డీఎస్పీ పి.భావన శుక్రవారం ప్రారంభించారు. విద్యార్థులు తమ నైపుణ్యంతో రూపొందించిన వస్త్రాలు, బెడ్ షీట్లు, వస్తువులు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా డీఎస్పీని కళాశాల సీఈఓ మీనా కొండారెడ్డి శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, కరస్పాండెంట్ నంద్యాల కొండారెడ్డి, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

తైక్వాండోలో పతకాలు

పోరుమామిళ్ల : హైదరాబాదు కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో జనవరి 28, 29, 30 తేదీల్లో జరిగిన జాతీయ స్థాయి తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీల్లో పోరుమామిళ్లకు రెండు పతకాలు లభించాయని మాస్టర్ నాయబ్ రసూల్ చెప్పారు. శుక్రవారం నాయబ్ మాట్లాడుతూ సీనియర్స్ విభాగంలో సాయిప్రీతి రజత పతకం, కేడెట్ విభాగంలో అబ్దుల్ అజీజ్ కాంస్య పతకం సాధించారన్నారు. కార్యక్రమంలో కోచ్‌లు ఉస్మాన్, ఆంజనేయులు, గోవర్ధన్ పాల్గొన్నారు.

న్యాయం చేయాలని వినతి

మైదుకూరు : తన పొలాన్ని కొందరు కబ్జా చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని బద్వేలు ఆర్డీఓకు విన్నవించినట్లు మండలంలోని జాండ్లవరం గ్రామానికి చెందిన సంబటూరు ప్రసాద్ శుక్రవారం తెలిపారు. నంద్యాలంపేట రెవెన్యూ పొలంలోని సర్వే నంబర్ 989/1లోని 1.60 ఎకరాల పొలాన్ని తాను 14 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నట్టు ఆయన తెలిపారు. అయితే తమ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు తన పొలాన్ని కొద్దికొద్దిగా కబ్జా చేస్తున్నారని ఆర్డీఓకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వారి నుంచి తన పొలాన్ని ఖాళీ చేయించి తనకు న్యాయం చేయాలని ఆర్డీఓను కోరారు.

ఏపీజీబీని తరలించొద్దు

ప్రొద్దుటూరు రూరల్ : కడపలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు కేంద్ర కార్యాలయాన్ని అమరావతికి తరలించవద్దని సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. స్థానిక దస్తగిరిపేట వద్ద ఉన్న ఏపీజీబీ వద్ద శుక్రవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడపలో నూతన కార్యాలయాలను ఏర్పాటు చేయాల్సింది పోయి, ఏపీజీబీ కేంద్ర కార్యాలయం తరలించడం సరి కాదన్నారు. ఈ కార్యక్రమంలో బాబు, ముంతాజ్‌బేగం, వెంకటసుబ్బమ్మ, రాములమ్మ, డీవైఎఫ్‌ఐ కార్యదర్శి విశ్వనాథ్ పాల్గొన్నారు.

ప్రమాదాలను నివారిద్దాం

ప్రొద్దుటూరు క్రైం : రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని ఆర్టీఓ మురళీధర్ తెలిపారు. రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి, ఆర్టీసీ బస్టాండు, రూరల్ పోలీస్ స్టేషన్‌లో అక్కడి అధికారులు, సిబ్బందికి శుక్రవారం కరపత్రాలు అందజేశారు. ఆర్టీఓ మాట్లాడుతూ ట్రాఫిక్ మాసాత్సోవాల నేపథ్యంలో అధికారులంతా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లా ఆస్పత్రికి వేలాది ప్రజలు వస్తుంటారని వారికి ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తామన్నారు. ఏర్పాట్లపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబుతో ఆర్టీఓ, ఎంవీఐలు చర్చించారు. నారాయణనాయక్, శ్రీనివాసరెడ్డి, రూరల్ సీఐ బాలమద్దిలేటి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయునికి సన్మానం

పోరుమామిళ్ల : మండలంలోని రామేశ్వరం ఎంపీపీ పాఠశాలలో హెడ్ మాస్టర్‌గా పని చేస్తున్న ముత్తుముల రామకృష్ణారెడ్డి శుక్రవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా వెంకటాపురం స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయ బృందం రామకృష్ణారెడ్డి దంపతులకు పూలమాలలు, శాలువా, మెమెంటో అందించి సన్మానించారు. రామేశ్వరం గ్రామస్తులు ఆయనకు బంగారు ఉంగరం బహూకరించారు. సన్మాన సభ ఎంఈఓ కాశయ్య, ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షులు పుల్లయ్య పాల్గొన్నారు.

స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలి

ప్రొద్దుటూరు రూరల్ : జిల్లాలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటుచేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నాగరాజు డిమాండ్ చేశారు. స్థానిక పాత బస్టాండ్ నుండి శివాలయం సర్కిల్ వరకు సీపీఎం జీపుజాత శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, కడప జిల్లాలో స్టీల్ ప్లాంట్, రాయలసీమకు రూ.50లక్షలు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ ఇస్తామని చెప్పి కేంద్ర ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. మనోహర్, సత్యనారాయణ, ముంతాజ్ బేగం, సుబ్బయ్య, బాబు, ఓబులేసు, రాములమ్మ పాల్గొన్నారు.

మెడికల్ స్టోర్ ప్రారంభం



మెడికల్‌స్టోర్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ప్రొద్దుటూరు క్రైం: స్థానిక హోమస్ పేటలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీహరి మెడికల్ స్టోర్స్‌ను ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. మెడికల్ స్టోర్స్ అధినేతలు వంశీ అబ్బూరి, శ్రావణ్‌కుమార్ రెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి మాట్లాడుతూ తిరుపతి నగరంలో రెండు స్టోర్లు, ప్రొద్దుటూరులో ఒకటి ఏర్పాటుచేసి అతి తక్కువ ధరకే మందులను అందిస్తున్నామన్నారు. వై.వెంకటరామమునిరెడ్డి, ఎల్.రామలింగారెడ్డి, ఆర్.రవిచంద్రారెడ్డి, ఎ.సంధ్య, ఎల్.చైతన్యలత, పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించాల్సిన బాధ్యత అధికారులదే

- ప్రభుత్వం కార్యక్రమ వివరాలు ఎమ్మెల్యేకు తెలియకుంటే ఎలా?
- అధికారుల తీరును ప్రశ్నించిన ఎమ్మెల్యే డాక్టర్ సుధ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

గోపవరం : అధికారిక కార్యక్రమాలలో మండలాధికారులు ప్రొటోకాల్ పాటించాలని ఎమ్మెల్యే డాక్టర్ సుధ అన్నారు. శుక్రవారం ఎంపీపీ ధనలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వాలు వస్తుంటాయి, పోతుంటాయి అని, అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు సేవ చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 8 నెలల కాలంలో ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే కార్యక్రమాలకు సంబంధించి అధికారులు ప్రొటోకాల్ పాటించడంలేదని అసహనం వ్యక్తం చేశారు. ఒక్క కార్యక్రమానికి ఎమ్మెల్యేగా తనకు ఎలాంటి సమాచారం అధికారులు ఇవ్వడం లేదంటే వారి పనితీరు ఏ విధంగా ఉందో తెలిస్తోందన్నారు. ఇక మీదట ఇలా జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. బేతాయపల్లె గ్రామ పంచాయతీ పి.పి.కుంట జగనన్న లేఅవుట్‌లో అక్రమంగా వేసిన గుడిసెలను వెంటనే తొలగించి గతంలో పట్టాలు పొందిన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని తహసీల్దారు త్రిభువన్‌రెడ్డిని ఆదేశించారు. నిజంగా అన్ని అర్హత ఉండి ఇళ్లు లేని నిరుపేదలు గుడిసెలు వేసుకుని ఉంటే వారికి మరోచోట స్థలాలు కేటాయించాలని తహసీల్దారుకు సూచించారు. ఈ విషయంపై తహసీల్దారు త్రిభువన్‌రెడ్డి వివరణ ఇస్తూ జగనన్న లేఅవుట్‌లో అక్రమ గుడిసెలు తొలగించాలంటే తగినంత పోలీసు ప్రొటెక్షన్ అవసరమని, ఇందుకోసం మైదుకూరు డీఎస్పీకి రాతపూర్వకంగా లేఖ రాశామని, కానీ వారి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం లేదన్నారు. పోలీసు ప్రొటెక్షన్ ఇచ్చిన వెంటనే గుడిసెలను తొలగించి వచ్చే సర్వసభ్య సమావేశంలోపు లేఅవుట్‌లో గత ప్రభుత్వంలో ఇచ్చిన పట్టాలకు సంబంధించి లబ్ధిదారులందరికి స్థలాలు కేటాయిస్తామని తహసీల్దారు తెలిపారు. ప్రస్తుతం రామాపురం రెవెన్యూ పొలంలో రీసర్వే జరుగుతుందని, ప్రజలు కూడా సహకరిస్తున్నారన్నారు. అలాగే డీకేటీ భూములకు సంబంధించి 20 సంవత్సరాలు దాటిన వాటికి క్రయవిక్రయాలు జరుపుకునేందుకు గత ప్రభుత్వం హక్కు కల్పించిందని, ప్రస్తుతం అది కూడా కొనసాగుతోందన్నారు. రేషన్‌కార్డులు కావాలని చాలా మంది అడుగుతున్నారని, ప్రభుత్వం నుంచి ఎలాంటి జీవో విడుదల కాలేదన్నారు. మల్లెంకొండేశ్వరస్వామి కొండ వద్దకు వెళ్లేందుకు 5 కిలోమీటర్ల మేర రోడ్డు వేసేందుకు అనుమతి కావాలని ఎమ్మెల్యేను తహసీల్దారు కోరగా అటవీశాఖ పరిధిలో ఉన్నందున రోడ్డు వేసేందుకు అనుమతి వస్తే తాను సహకరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం శాఖలవారీగా అధికారులు తమ నివేదికలను సమావేశంలో చదివి వినిపించారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ మరిన్ని సేవలు అందించాలని ఎమ్మెల్యే కోరారు. వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్య రాకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీఓ రామనాథ్‌రెడ్డి, ఎంపీటీసీలు సరస్వతి, రాజేశ్వరి, రామ్మోహన్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మిదేవి, వైద్యాధికారి డాక్టర్ నరసింహారెడ్డి, పశువైద్యాధికారి డాక్టర్ క్రిష్ణవేణి, ఏఓ రామకృష్ణయ్య, ఎంఈఓ చెన్నయ్య, అన్నిశాఖల అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



శానిటేషన్ కమిటీ సభ్యులతో సీఐటీయూ నేతలు సత్యనారాయణ, విజయ్‌కుమార్

ప్రొద్దుటూరు క్రైం : జిల్లా ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. జిల్లా ఆస్పత్రిలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ శానిటేషన్ వర్కర్లకు జీవో ప్రకారం రూ.18,600 వేతనం ఇవ్వాలన్నారు. కార్మికులకు ఈఎస్‌ఐ, పీఎఫ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా ఆస్పత్రి శానిటేషన్ వర్కర్స్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా రత్నమ్మ, ప్రధాన కార్యదిర్శిగా కళావతి, కమిటీ సభ్యులుగా నరసింహ, మహేష్, గంగాధర్, నరసింహులు, మల్లి, లక్ష్మీదేవి, మల్లమ్మ, జ్యోతిలను నియమించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి విజయ్‌కుమార్, పట్టణ కార్యదర్శి రాఘవ, తదితరులు పాల్గొన్నారు.

న్యాయమూర్తికి సన్మానం



జడ్జి రమేష్‌కుమార్‌ను సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సుదర్శన్‌రెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు కోర్టులో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్తున్న రెండో అదనపు జిల్లా జడ్జి రమేష్ కుమార్‌కు బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న కె.సత్యకుమారికి పదోన్నతి లభించడంతో ఇదే కోర్టులో రెండో అదనపు జిల్లా జడ్జిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా జడ్జి సత్య కుమారిని న్యాయవాదులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి హారిక, ఒకటో మెజిస్ట్రేట్ సురేంద్రారెడ్డి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సుదర్శన్‌రెడ్డి, కార్యదర్శి ఖాసి గుర్రప్ప, సీనియర్ న్యాయవాదులు మార్తల సుధాకర్‌రెడ్డి, దాదాపీర్, వెంకటరత్నం, దాదాహయ్యత్, లత, జేకే ఆచారి, ఏపీపీలు రాంప్రసాద్‌రెడ్డి, బందెల ఓబులేసు, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు



అక్రమ నిర్మాణాల తొలగింపును పర్యవేక్షిస్తున్న తహసీల్దారు, మున్సిపల్ కమిషనర్

బద్వేలు అర్బన్ : ప్రభుత్వ స్థలాలు, రహదారులకు కేటాయించిన స్థలాలు, ప్రజాప్రయోజనాల కోసం కేటాయించిన స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తప్పవని గోపవరం తహసీల్దారు త్రిభువన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డిలు హెచ్చరించారు. మున్సిపాలిటీ పరిధిలోని ఎన్‌జీఓ కాలనీలోని సర్వే నెంబర్ 953, 955లలోని ప్రభుత్వ స్థలాల్లో వెలసిన అక్రమ నిర్మాణాలను శుక్రవారం మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని ఆయా సర్వే నెంబర్లలోని ఖాళీ స్థలాలలో ఎవరికి ఇంటి పట్టాలు ఇచ్చినట్లు రెవెన్యూ రికార్డుల్లో నమోదు కాకపోయినప్పటికీ కొందరు ఆక్రమణదారులు స్థలాలలో నిర్మాణాలను చేపట్టారని, ఈ మేరకు ఆక్రమణలను తొలగించామని తెలిపారు. కార్యక్రమంలో అర్బన్ సీఐ రాజగోపాల్, ఎస్‌ఐ సత్యనారాయణ, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులకు పార్టీలకతీతంగా లబ్ధి చేకూర్చండి



తహసీల్దారుతో మాట్లాడుతున్న హ్యూమన్ రైట్స్ బృందం

అట్లూరు : పార్టీలతో పనిలేకుండా అర్హులైన పేదల పక్షాన నిలిచి పేదలకు లబ్ధి చేకూరేలా పనిచేయాలని తహసీల్దారు సుబ్బలక్షుమ్మను ఆంధ్రప్రదేశ్ కంజ్యూమర్ జస్టిస్, హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్రీనివాసులు, రాష్ట్ర మహిళా కన్వీనరు జి.సరస్వతి కలసి కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో పేదలు ఇంకా పేదలుగానే మిగిలి పోతున్నారన్నారు. భూస్వాములు మాత్రం పార్టీలకు తొత్తులుగా మారి ఇంకా బలంగా తయారవుతున్నారన్నారు. రాజకీయ తొత్తులుగా ఉన్న వారికి మాత్రమే లబ్ధి చేకూరుతోందన్నారు. పార్టీలకు సంబంధం లేకుండా పేదల పక్షాన నిలిచి పేదలకు లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం రాయలసీమ అధ్యక్షుడు చాట్ల విద్యాసాగర్, జిల్లా అధ్యక్షుడు తిరుపాలయ్య, సెక్రటరీ శంకర్, యల్లయ్య, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

రాచమల్లు మునిరత్నమ్మకు నేతల నివాళి



మాజీ ఎమ్మెల్యే రాచమల్లుతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి

ప్రొద్దుటూరు : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి తల్లి రాచమల్లు మునిరత్నమ్మ భౌతికకాయాన్ని శుక్రవారం ప్రముఖ నేతలు సందర్శించి నివాళులర్పించారు. రాజంపేట, బద్వేల్ ఎమ్మెల్యేలు ఆకేపాటి అమరనాథరెడ్డి, డాక్టర్ సుధ, ఎమ్మెల్సీలు డీసీ.గోవిందరెడ్డి, పి.రామసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి, మాజీ ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా, మాజీ ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, మల్లెల లింగారెడ్డి, గురుమోహన్, దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, వెన్నపూస రవీంద్రారెడ్డి, సంబూటరు ప్రసాద్‌రెడ్డి, జేష్టాది శారద, రామగోవిందరెడ్డి, అంజనీకుమారి, డాక్టర్లు నాగదస్తగిరిరెడ్డి, నరసింహారెడ్డి, కిశోర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, వరలక్ష్మి, శిల్ప, న్యాయవాదులు రఘునాథరెడ్డి, ఓబులేసు, విజయసారథి, పవన్ కుమార్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, పోరెడ్డి నరసింహారెడ్డి, కల్లూరు నాగేంద్రారెడ్డి, శౌరి సుభాష్‌రెడ్డి, నారాయణరెడ్డి, మెట్టుపల్లె ప్రభాకర్ రెడ్డి, జీరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, సత్యనారాయణ, తదితరులు మునిరత్నమ్మకు నివాళులర్పించారు.

కేటాయించిన స్థలంలోనే వ్యాపారాలు చేసుకోవాలి

ప్రొద్దుటూరు: స్థానిక తాత్కాలిక కూరగాయల మార్కెట్‌లో వ్యాపారులకు కేటాయించిన స్థలంలోనే వ్యాపారాలు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. స్థానిక తాత్కాలిక కూరగాయల మార్కెట్‌ను కమిషనర్ శుక్రవారం పరిశీలించారు. వ్యాపారులకు కేటాయించిన స్థలంలో కాకుండా ఇతర ప్రాంతాల్లో అమ్మరాదన్నారు. వి.సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో రైలు నిలపాలి

ప్రొద్దుటూరు : కడప నుంచి విశాఖపట్నం వెళ్లే తిరుమల ఎక్స్‌ప్రెస్‌ను ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌లో నిలిపితే నాలుగు నియోజకవర్గాల ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని టీడీపీ మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డి తెలిపారు. తన గృహంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ కడప – విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ రైలు నీటి కోసం కొండాపురం స్టేషన్‌కు వస్తోందన్నారు. ఎర్రగుంట్లలో స్టాపింగ్ పెడితే ప్రొద్దుటూరు, కమలాపురం, మైదుకూరు, పులివెందుల నియోజకవర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు.

పరామర్శ

గోపవరం : మండలంలోని రాచాయపేట సర్పంచ్ నాగేంద్ర బావమరిది వెంకటతారక్ ఇటీవల బ్రెయిన్ ఆపరేషన్ జరిగి ప్రస్తుతం కోలుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ శుక్రవారం రాచాయపేటలోని సర్పంచ్ నాగేంద్ర ఇంటికి వచ్చి వెంకటతారక్‌ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య పరిస్థితి మెరుగుపడే వరకు జాగ్రత్తగా ఉండాలని ఆమె సూచించారు. బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం చేశారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చల్లా రవిచంద్రారెడ్డి, జిల్లా ఆర్గనైజేషనల్ సెక్రటరీ హరిక్రిష్ణారెడ్డి, గోపవరం ఎంపీటీసీ సరస్వతి, మాజీ మండలాధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన ర్యాలీ

దువ్వూరు(చాపాడు) : దువ్వూరులో శుక్రవారం కుష్టు వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి పి.వివకని మాట్లాడుతూ కుష్టు వ్యాధి మైకో బ్యాక్టీరియా లెప్రే అనే క్రిమి వలన వ్యాధి వస్తుందని దీనిని తొలి దశలో గుర్తించి మల్టీ డ్రగ్ తెరపీ ద్వారా నయం చేయవచ్చున్నారు. అనంతరం వైద్య సిబ్బంది వ్యాధి నివారణకు ప్రతిజ్ఞ చేశారు.

వీరభద్రస్వామి సన్నిధిలో ప్రత్యేక హోమం

చాపాడు : మండలంలోని అల్లాడుపల్లె శ్రీవీరభద్ర స్వామిదేవస్థాన సన్నిధిలో శుక్రవారం ప్రత్యేక హోమం నిర్వహించారు. ఇటీవల సంక్రాంతి ఉత్సవ వేడుకలలో భాగంగా వీరభద్రస్వామి గ్రామోత్సవ వేడుకలో ప్రమాదవశాత్తు ఉత్సవ విగ్రహాలు కింద పడ్డాయి. ఈ క్రమంలో దోష నివారణ కోసం ఆలయ పండితులు ప్రత్యేక హోమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు నరేంద్రస్వామి, భరత్ శర్మ పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన ఉండాలి

మైదుకూరు : ఆర్థిక అక్షరాస్యత పట్ల విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని మండలంలోని జీవీ సత్యం ఏపీజీబీ బ్రాంచ్ మేనేజర్ ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో రిజర్వ్ బ్యాంకు సౌజన్యంతో హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం డిపాజిటర్ ఎడ్యుకేషన్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ క్రైమ్ పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తాము తెలుసుకున్న విషయాలను విద్యార్థులకు తమ కుటుంబ సభ్యులకు, తోటి మిత్రులకు తెలియజేయాలని సూచించారు. కృష్ణారెడ్డి, రమేష్, పెరుగు కృష్ణయ్య యాదవ్ పాల్గొన్నారు.

పది విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి

బద్వేలు అర్బన్ : పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో పది విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని తనిఖీ చేసిన ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 27,500 మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజరవుతుండగా వారిలో 14 వేల మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉన్నారని తెలిపారు. పరీక్షా పేపర్ల విధానం మారిన నేపథ్యంలో జిల్లాలోని నాలుగు డివిజన్లలో విడతల వారీగా ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

ప్రైవేటు పాఠశాలకు షోకాజ్ నోటీసు

గత ఆరు నెలలుగా అనుమతి పొందిన చోటుకాకుండా వేరే ప్రాంతంలో తరగతులు నిర్వహిస్తున్న లిటిల్ ఫ్లవర్ స్కూల్ యాజమాన్యానికి షోకాజ్ నోటీసులు అందజేసినట్లు డిప్యూటీ డీఈఓ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా అనుమతి ఉన్న చోటు కాకుండా వేరే ప్రాంతంలో తరగతులు నిర్వహిస్తే పాఠశాల గుర్తింపు రద్దు చేస్తామని హెచ్చరించారు.

ఎంపీడీఓ కార్యాలయం ఆకస్మిక తనిఖీ

చాపాడు : స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని శుక్రవారం సాయంత్రం జిల్లా పరిషత్ సీఈఓ ఓబులమ్మ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో రికార్డులు, ఉద్యోగులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. మండల వ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వీరకిషోర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ మహమ్మద్ గౌస్, పీఆర్ ఏఈ సాయివర్మ, ఏపీఓ జగదీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాయి బాలాజీ హాస్పిటల్ ప్రారంభం

ప్రొద్దుటూరు క్రైం: స్థానిక హోమస్‌పేటలోని రామలింగారెడ్డి హాస్పిటల్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన సాయి బాలాజీ సూపర్ స్పెషాలిటి హాస్పిటల్ (డయాబెటిస్, ఎండోక్రైన్ మరియు మెటర్నిటీ సెంటర్)ను ఆస్పత్రి వైద్యులు షుగర్, థైరాయిడ్, హార్మోన్ వ్యాధి నిపుణులు యం.పవన్‌కుమార్ రెడ్డి, గర్భిణీ, స్త్రీల శస్త్రచికిత్స నిపుణురాలు డాక్టర్. అన్నారెడ్డి తేజలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ తమ ఆస్పత్రిలో షుగర్, థైరాయిడ్‌లకు మెరుగైన చికిత్స అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని పలువురు వైద్యులు, ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రజలపై భారం మోపడం దుర్మార్గం



మాట్లాడుతున్న శివకుమార్

మైదుకూరు : రాష్ట్ర ప్రభుత్వం అదానితో కుమ్మక్కై ప్రజల మీద రూ.16వేల కోట్ల విద్యుత్ సర్దుబాటు చార్జీలను మోపడం దుర్మార్గమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జి.శివకుమార్ విమర్శించారు. పార్టీ మహాసభలు ఫిబ్రవరిలో జరుగనున్న నేపథ్యంలో విద్యుత్ సర్దుబాటు చార్జీలను వ్యతిరేకించాలని డిమాండ్ చేస్తూ నంద్యాల నుండి చేపట్టిన సీపీఎం జీపు జాతా శుక్రవారం మైదుకూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పట్ల ప్రజలు ఎన్నో ఆశలతో ఎదురుచూస్తుంటే ప్రజలపై కరెంటు చార్జీల భారం మోపుతోందని ఆరోపించారు. టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను పెంచమని, అవసరమైతే తగ్గిస్తామని హామీ ఇచ్చిన విషయం మరిచారా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఎం నంద్యాల జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నాగరాజు, సీపీఎం మైదుకూరు మండల కార్యదర్శి షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

లోక పావని.. జగత్ జనని





ప్రొద్దుటూరు : చండీహోమం నిర్వహిస్తున్న పండితులు, పోరుమామిళ్ల : అగ్ని గుండ ప్రవేశం చేస్తున్న పురోహితులు

భక్తిశ్రద్ధలతో వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆత్మార్పణ దినోత్సవం



కలసపాడు : అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయంలో శుక్రవారం వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం నిర్వహించారు. వేకువజామున అమ్మవారికి గణపతి, నవగ్రహ పూజలు జరిపారు. లోక కల్యాణార్థం రుద్ర, చండీ హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూర్ణాహుతిగా హోమ, సుగంధ, పూజా ద్రవ్యాలు సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజించారు. బంగారు శ్రీచక్రమేరువుకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మూల విరాట్‌ను వజ్ర కిరీటంతో అలంకరించారు. భక్తులకు మధ్యాహ్నం అన్నప్రసాద వినియోగం చేశారు. సాయంత్రం 102 మంది ఆర్యవైశ్య కన్యకలు వివిధ రకాల పూలతో నింపిన 102 గంపలను తీసుకొని పుర వీధుల్లో వాసవీ మాత నామస్మరణ మధ్య ఊరేగించారు. అనంతరం అమ్మవారి మూలవిరాట్‌ను పుష్పాలతో అభిషేకించారు. 102మంది ఆర్యవైశ్య మహిళలు సామూహికంగా కుంకుమార్చన ఆచరించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రామ్మోహనరావు, ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ రవీంద్రబాబు, కార్యదర్శి మురికి నాగేశ్వరరావు, ఆర్యవైశ్య సభ ప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కలసపాడులో..

కలసపాడు : స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవ వేడుకను శుక్రవారం ఆర్యవైశ్యులు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున 5 గంటలకు నగర సంకీర్తన జరిపారు. ఉదయం గణపతిపూజ, నగరేశ్వర స్వామికి, వాసవీమాతకు అభిషేకాలు, మహా మంగళహారతి, ఆర్యవైశ్య మహిళలచే సామూహిక లక్ష కుంకుమార్చన, భజనలు, గుడి ఉత్సవం, పవళింపు సేవ, తీర్థప్రసాద పంపిణీ తదితర కార్యక్రమాలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కామిశెట్టి సుదర్శన్, గౌరవాధ్యక్షుడు ఎం.నాగరాజ, బి.యల్లయ్య, జి.రామాంజనేయులు, మహిళా మండలి అధ్యక్షురాలు టి.సత్యవతమ్మ, సెక్రటరీ జె.నారాయణ, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో..

పోరుమామిళ్ల : స్థానిక అమ్మవారిశాలలో శుక్రవారం శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఆర్యవైశ్యులు ఘనంగా నిర్వహించారు. అనంతరం కన్యకాంబ విగ్రహంతో పురోహితులు, భక్తులు ఆలయం బయట ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో ప్రవేశించారు.